క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం: మండలంలోని వెంకటాపురం సచివాలయ పరిధిలోని ఉడమాలకూర్తి గ్రామం వద్ద కుశస్థలి నదిపై రూ.27 కోట్లతో వంతెన నిర్మించనున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదివారం ఉదయం 9 గంటలకు శంఖుస్థాపన చేస్తున్నట్లు స్థానిక సర్పంచ్ చిట్టి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు జిల్లా పార్లమెంట్ సభ్యులు రెడ్డెప్ప, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, జిల్లా కలెక్టర్ తదితరులు పాల్గొంటారని అన్నారు. అనంతరం బహిరంగ సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని తెలిపారు.

తల్లిదండ్రుల సహకారం అవసరం



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం

పాలసముద్రం: విద్యార్థుల ఎదుగుదలకు తల్లిదండ్రుల సహకారం తప్పనిసరి అని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మనోహర్ నాయుడు తెలిపారు. శనివారం భోజనం విరామ సమయంలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంటి వద్ద విద్యార్థులు ఏమి చదువుతున్నారో గమనించాలని, వారికి పనులు చెప్పకుండా చదువుకునేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ రాజేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో సామాజిక దృక్పథం



ఎన్‌సీసీ విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

కార్వేటినగరం: నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ)లో శిక్షణ పొందిన విద్యార్థులకు సామాజిక దృక్పథం అలవడుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో ఎన్‌సీసీలో ప్రవేశం పొందిన 67 మంది విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో శిక్షణ పొందడం ద్వారా సామాజిక సేవ, జాతీయ భావం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. శారీరక ధృడత్వం, ఆలోచన శక్తి పెరుగుతుందని, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉంటాయని, తద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, సీఆర్పీఫ్, బీఎస్‌ఎఫ్ తదితర విభాగాల్లో అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని పలువురికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.

అభివృద్ధికే ప్రాధాన్యం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

నగరి: అభివృద్ధే ప్రాతిపదికగా మున్సిపల్ కార్యవర్గం ముందుకు వెళ్తోందని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. శనివారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సమావేశ అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు తమ వార్డుల్లో చేపట్టవలసిన కొన్ని అభివృద్ధి పనులకు చైర్మన్ దృష్టికి తెచ్చారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మంత్రి ఆర్‌కే రోజా సహకారంతో మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లో ప్రాధాన్యతానుసారం ప్రజావసరాలకు తగిన విధంగా అభివృద్ధి పనులు చేస్తూ వెళ్తున్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేపడుతున్న భక్తులు

కార్వేటినగరం: కార్వేటినగరంలో చెందిన ప్రసిద్ధి గాంచిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో జీడీనెల్లూరు వాసి దాత దీపక్‌కుమార్ కుటుంబ సభ్యులు శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వంద మందికి అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి భక్తుడు ముందుకొచ్చి అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో దీపక్‌కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

- ఇదే ప్రభుత్వ లక్ష్యం
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద నాలుగేళ్లలో రూ.8.845 కోట్లతో 1.40 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్యం
- వైఎస్సార్ కంటి వెలుగు నిర్వహణకు రూ.13 కోట్లు వెచ్చింపు
- సీఎం జగనన్నకే వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తెచ్చారు
- పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా



వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురంలో హెల్త్ కార్డులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా

పుత్తూరు రూరల్: రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న ధృడ సంకల్పంతో వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ప్రతి పేదవాడి కోసం మరో అడుగు ముందుకేసి దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఎవరి ఊహకు అందని, అందినా ఎవరూ సాహసించలేని జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టడం మన సీఎం జగనన్నకే సాధ్యమైందన్నారు. శనివారం వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంత్రి రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గడచిన నాలుగేళ్లలో రూ.8,845 కోట్లతో 1.40 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత కంటి చికిత్సతో పాటు ఉచిత కంటి అద్దాల పంపిణీ కోసం రూ.13 కోట్లు కేటాయించినట్లు వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను, 542 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. చికిత్స తర్వాత విశ్రాంతి సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.1004 కోట్లతో 16.19 లక్షల మందికి లబ్ధి చేకూరినట్లు వివరించారు. 108 సేవల కింద 768 అత్యవసర అంబులెన్స్‌లు, 910 మొబైల్ క్లినిక్ అంబులెన్స్‌లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. వైద్య చదువుల కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.8 వేల కోట్ల ఖర్చుతో కొత్తగా 17 మెడికల్ కాలేజీలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కోసం నాలుగేళ్లలో రూ.6,687 కోట్లతో 35 లక్షల మందికి లబ్ధి చేకూరినట్లు వివరించారు. వైద్య శాఖలో డాక్టర్ల నుంచి నర్సుల వరకు 50 వేలకు పైగా నియామకాలు జరిగినట్లు వెల్లడించారు. అనంతరం హెల్త్ కార్డులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గ పరిశీలకులు మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, సుబ్రమణ్యంరెడ్డి, సుధీర్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకట్రామరాజు, చంద్రరాజు, బాబు, మాధవరాజు, సురేష్‌రాజు సర్పంచులు అంజమ్మ, శ్రీవిద్య, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి రోజా

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు

పుత్తూరు రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గుర్తించిన పనులను సైతం త్వరితగతిన పూర్తి చేస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. శనివారం వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురం గ్రామంలో రూ.16.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.3.60 లక్షలతో తాగునీటి బోరు, డ్రైనేజీ పనులకు మంత్రి రోజా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం పథకం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, నగరి నియోజకవర్గ పరిశీలకులు మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, సుధీర్‌రెడ్డి, సురేష్‌రాజు, చంద్రరాజు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత వైఎస్సార్



గోపిశెట్టిపల్లిలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ప్రతి పేదవాడికి విద్య, ఆరోగ్యం అందించిన ఘనత దివంగవత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిదే అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి దళితవాడలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ భారీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెడితే, ఆయన తనయుడు సీఎం జగన్ గ్రామ స్వరాజ్యం కోసం సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. సీఎం జగనన్న విద్య, వైద్యంతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారని తెలిపారు. అనంతరం గోపిశెట్టిపల్లిలో ఏర్పాటు చేసిన భారీ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి సుజన

పుత్తూరు రూరల్: బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు) ఎన్నికలకు సంబంధించి కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని నగరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుజన ఆదేశించారు. శనివారం స్థానిక ప్రైవేటు కళ్యాణమండపంలో పుత్తూరు, వడమాలపేట మండలాల బీఎల్‌ఓతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎల్‌ఓలకు కేటాయించిన ఆయా పోలింగ్ స్టేషన్‌లలోని ఓటర్లకు సంబంధించి ఫారం 6, 7, 8లలో క్లైమ్స్‌ను సకాలంలో విచారణ పూర్తి చేయాలని వివరించారు. బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి, తహసీల్దార్లు జె.పరమేశ్వరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నెట్‌బాల్ పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు

పుత్తూరు రూరల్: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు పుత్తూరు మండలం గొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం భారతి తెలిపారు. మదనపల్లి మండలం చిన్నతిప్పసముద్రం ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో తమ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. అండర్-14 విభాగంలో సంధ్య, శృతి, పవిత్ర, మునిమోహిత్, చరణ్‌తేజ ఎంపిక కాగా, అండర్-17 విభాగంలో వరుణ్, ఉదయశ్రీ, మౌనిక, ఆర్తీ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను పీడీ గోపికృష్ణ, ఉపాధ్యాయ బృందం అభినందించింది.



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

10 నుంచి పవిత్రోత్సవాలు

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అక్టోబర్ 10వ తేదీ నుంచి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు, సిబ్బంది వల్ల తెలియక జరిగిన దోషాల నివృత్తి కోసం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. అక్టోబర్ 9వ తేదీ సాయంత్రం అంకురార్పణ జరుగుతుందన్నారు. 10న పవిత్ర ప్రతిష్ట, 11న పవిత్ర సమర్పణ, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 12న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన జరుగుతుందన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించడం జరుగుతుందన్నారు. పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

గడప వద్దకే ప్రభుత్వ పాలన

- సీఎం జగనన్న సహకారంతో మరమగ్గ కార్మికులకు విద్యుత్ చార్జీల తగ్గింపు
- మంత్రి ఆర్‌కే రోజా



కేవీపీఆర్ పేటలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: ప్రభుత్వ పాలనను ప్రజల గడప వద్దకే తెచ్చిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదే రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్ పేటలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. స్థానికులు మంత్రి రోజాకు గజమాలలు, దుశ్శాలువలతో హారతులు పట్టి ఆహ్వానించారు. మండల స్థాయి అధికారులతో కలసి ప్రతి గడపకు వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని నివాశితులకు వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వంలో పాలన గడప వద్దకే వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలకు మించి అమలు చేస్తున్న ఒకే ఒక్క నాయకుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఆ పథకాలు ప్రజలకు చేరడంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా ? అని తెలుసుకోవడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ ప్రాంతంలోని మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. విద్యుత్ చార్జీల విషయంలో మరమగ్గ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యను సీఎంకు తెలిపిన ఆయన నగరికి విచ్చేసిన సమయంలో అదనపు చార్జీలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం జరిగిందన్నారు. తాము చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమం రికార్డు పూర్వకంగా చెప్పగలమన్నారు. గత పద్నాలుగేళ్ల పాలనలో టీడీపీ చేసిన అభివృద్ధి పనులు చెప్పగలదా అని ప్రశ్నించారు. ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. అండగా నిలిచేదెవరో అవసరాల కోసం వచ్చేదెవరో వారికి తెలుసన్నారు. ప్రతి గడపలో లభించే ఆదరణే అందుకు నిదర్శనమన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు గంగాధరం, మురుగ, ఏజీ మణి, షణ్ముగం, మెప్మా టీఎల్‌ఎం సునీత, హౌసింగ్ ఏఈ భాస్కర్, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ పరమేశ్వరస్వామి

పుత్తూరు రూరల్: ఎస్సీ, ఎస్టీ కమిషన్ అందించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి సూచించారు. శనివారం పుత్తూరు మండలం టీఆర్ కండ్రిగ ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పౌర హక్కుల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి నెల 30వ తేదీన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడంతో పాటు, స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- ఇంటింటా సీఎం జగనన్నకు జనం బ్రహ్మారథం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి సచివాలయ పరిధిలోని ఈదువారిపల్లి, ఈదువారిపల్లి దళితవాడ, ఈదువారిపల్లి ఏఎడబ్ల్యూ, గోపిశెట్టిపల్లి గ్రామం, గోపిశెట్టిపల్లి, పెద్ద దళితవాడ, చిన్న దళితవాడ గ్రామాల్లో ఎంపీపీ లత, ఎంపీటీసీ మురగయ్య ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారురాలు తులసమ్మ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వ పథకాలు అందేవి కావని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వలంటీర్ల ద్వారా అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాలు ఇంటి గుమ్మం వద్దకే తెచ్చిస్తున్నారని ఆనందం వ్యక్తం చేసింది. అనంతరం మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల అనేక కుటుంబాలకు చెందిన వారు రేషన్ కార్డులు పొందారని గుర్తు చేశారు. సచివాలయ పరిధిలో అర్హులను గుర్తించి వారికి త్వరగా పక్కాగృహాలు మంజూరు చేయాలని తహసీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు. అలాగే ప్రతి గ్రామంలో విద్యుత్ తీగలు ఇళ్లపై ఉన్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి సమస్యలు లేకుండా చూడాలని విద్యుత్ ఏడీఈ నాగరాజుకు సూచించారు. అలాగే కొన్ని గ్రామాల్లో డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఆయా గ్రామాలను గుర్తించి వెంటనే డ్రైనేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

విద్యార్థిని నోట సంక్షేమ పథకాలు..

ఈదువారి పల్లి ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఎ.ప్రేమలత రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ముందు అనర్గళంగా చెప్పింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమలాంటి పేద విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాలను అందించి మేనమామగా నిలుస్తున్నారని చెప్పడంతో ఉప ముఖ్యమంత్రి ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఆ చిన్నారిని శాలువతో సన్మానించి, ఆర్థిక సాయం అందించి, ప్రభుత్వం తరపున పక్కాగృహం మంజూరు చేశారు. అలాగే ఉపాధ్యాయుడు ఇ.గోపీనాథ్‌ను అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ కూడా చిన్నారికి ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, తుడా ప్లానింగ్ విశ్రాంతి అధికారి కృష్ణారెడ్డి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, నాయకులు కృష్ణయాదవ్, అంకయ్య, ఉప సర్పంచ్ మోహన్, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించండి

విజయపురం (నగరి): అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని శనివారం మాధవరం ఐటీఐ కళాశాల పరిసర ప్రాంతాల్లో సిబ్బంది, విద్యార్థులు పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించారు. కళాశాల ప్రిన్సిపల్ గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మనమంతా కలిసి బాపు కలలను సాకారం చేద్దామని పిలుపునిచ్చారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష
- నగరి, జీడీ నెల్లూరు నియోజకవర్గాల్లో కార్యక్రమానికి భారీ స్పందన



వెదురుకుప్పం: కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చిత్తూరు రూరల్: గంగాధర నెల్లూరు మండలంలోని బాలగంగనపల్లి గ్రామ సచివాలయంలోని వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో శనివారం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, నాయకులతో కలిసి ఎంపీపీ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు వారివారి గ్రామాల్లోనే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా ఇప్పించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వమే తీసుకుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా దాదాపు 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందించడంతో పాటు కంటి చూపు సమస్య ఉన్నవారికి కళ్ల జోడును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డా.జి.వెంకట ప్రసాద్, గ్రామ సర్పంచ్ శేఖర్, జెడ్పీటీసీ లక్ష్మీప్రియ, వింజం సర్పంచ్ రామక్క గోవిందయ్య, వైద్యాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం..

వెదురుకుప్పం: సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యులు సుకుమార్ అన్నారు. మండలంలోని నల్లవెంగనపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపు 500 మందికి ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు పలువురికి కంటి అద్దాలను అందజేశారు. కన్వీనర్ పద్మనాభరెడ్డి, స్థానిక సర్పంచ్ పుష్ప, అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. శనివారం వనదుర్గాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్, సర్పంచ్ నరసింహరాజు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా ఆరోగ్య సిబ్బంది సర్వే చేసి 276 మందికి టోకెన్లు ఇచ్చారు. శనివారం క్యాంపులో 216 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు ఓ వరమని ఎంపీపీ లత అన్నారు. శనివారం సీడీ కండ్రిగ సచివాలయ ఆవరణలో సర్పంచ్‌లు మంగమ్మ, గోవిందమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 105 రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తోందన్నారు. అనంతరం ఎంపీడీఓ మోహన్ మురళి మాట్లాడుతూ కంటి చూపు తగ్గిన వారికి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు ఉచితంగా అందిస్తామన్నారు. అనంతరం సచివాలయ ఆవరణలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి త్రిశూల్, ఎంఈఓ విజయకుమార్, వైద్యాధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురమ: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు శ్రీరామరక్ష అని మండల ప్రత్యేకధికారి మైనింగ్ డీడీ ప్రసాద్ అన్నారు. మండలంలోని ముద్దుకుప్పం సచివాలయ పరిధిలోని ముద్దుకుప్పం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అనంతరం సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ సభ్యులు సిద్దయ్య, మండల అధికారులతో పాటు వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఎంపీడీఓ నీలకంఠేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు బీపీ, షుగర్, రక్తహీనత వంటి అనేక రకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్యభాగ్యం...

నగరి: జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటా ఆరోగ్య భాగ్యం సిద్ధిస్తోందని ఎంపీపీ భార్గవి అన్నారు. శనివారం మండలంలోని తెరణి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ రమేష్‌తో పాటు ఐదుగురు వైద్యులు పాల్గొని సర్వేలో స్లిప్పులు అందజేసిన వారికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ లీలామాధవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్‌లు నిర్మల, జయరామ్, ఎంపీటీసీలు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు



పాలసముద్రంలో..



శ్రీరంగరాజపురంలో..



నగరి: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు